క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని సాంబశివనగర్, సింగునగర్, పండరీపురం, సుగాలీకాలనీ ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు పెట్రోలు బంకు ఆరంభం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి-గుంటుపాలెం గ్రామాల మధ్య సొసైటీ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన పెట్రోలు బంకు ఈనెల 16న తెరుచుకోనుంది. ఉదయం 10 గంటలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయులు, ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవం జరుగుతుందని కారుమంచి సొసైటీ సీఈవో వైవీ నారాయణ శుక్రవారం తెలిపారు. అలాగే కారుమంచి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభోత్సవం చేస్తారన్నారు.

జూనియర్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో 2025–26 సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవచ్చు. 10వ తరగతిలో సాధించిన మార్కులు, ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా ఎంపిక జరుగుతుందన్నారు. ప్రతి సెక్షన్‌కు 40 మంది విద్యార్థుల ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించవచ్చు అన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఈపూరు (శావల్యాపురం): మండల కేంద్రంలో ఓ వివాహిత పట్ల స్థానికుడు ఒకరు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై కేసు నమోదైంది. స్థానిక ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు కథనం ప్రకారం.. గ్రామంలో కొద్ది కాలంగా మార్కెట్ నిర్వహిస్తున్న నిర్వాహకుడి భార్యపై గ్రామానికి చెందిన గుంటకల లక్ష్మీనారాయణ కోర్కె తీర్చాలంటూ వెంటపడుతున్నాడు. దీంతో విషయాన్ని సదరు వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

ద్విచక్ర వాహనం చోరీ

నరసరావుపేటటౌన్: మసీదు వద్ద నిలిపిన ద్విచక్రవాహనం అపహరణకు గురైన సంఘటన శుక్ర వారం పట్టణంలో చోటుచేసుకుంది. సాంబశివరావుపేటకు చెందిన షేక్ మహ్మద్ ఖాశిం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల మసీదు పక్కన తన ద్విచక్రవాహనాన్ని నిలిపి మధ్యాహ్నం నమాజ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి వాహనం అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితుడిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం 11వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నుంచి వేడుకలు ప్రారంభమైనట్లు ఆలయ ప్రధానార్చకులు బీవీ మారుతీరామచార్యులు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గ్రామస్తులు సహకారంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తామన్నారు.

17 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

నరసరావుపేట: ఉచిత 185వ యోగా శిక్షణా శిబిరం 17వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్ర నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట్ జనార్దన్ శుక్రవారం తెలిపారు. శ్రీపట్టాభిరామ స్వామి ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వర కల్యాణ మండపంలో 28 రోజుల పాటు రోజు ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, 9490846333, 9491665733 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాయితీపై అదనపు లోడు క్రమబద్ధీకరించుకోండి

రొంపిచర్ల: మండలంలోని గృహ విద్యుత్ వినియోగదారులు 50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవాలని ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. గృహ వినియోగదారులు కిలోవాట్‌కు రూ.1250లు, 2 కిలోవాట్స్‌కు రూ.2450లు, 3 కిలో వాట్స్‌కు రూ.3650లు, 4కిలో వాట్స్‌కు రూ.4850లు 5కిలో వాట్స్ లోడుకు రూ.6050లు చెల్లిస్తే సరిపోతుందన్నారు.

మరుగున పడిన

రవ్వారం మంచినీటి పథకం

- అధికారుల నిర్లక్ష్యమే శాపం
- పథకం పరిధిలో 10 గ్రామాలకు తాగునీరు



అలంకార ప్రాయంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్

నూజెండ్ల: మండల పరిధిలోని రవ్వారంలో పది గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం నిరుపయోగంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో చిన్నపాటి మరమ్మతులకు నోచుకోక ఓవర్ హెడ్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్స్ అలంకారప్రాయంగా మారాయి. 1999 సంవత్సరంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సంయుక్తంగా రూ.99 లక్షల వ్యయంతో మంచినీటి చెరువు ఓవర్‌హెడ్ ట్యాంకు ఫిల్టర్ బెడ్స్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పథకం ద్వారా రవ్వారం, పాతరెడ్డిపాలెం, బుర్రిపాలెం, గాంధీనగర్, తిమ్మాపురం, కొత్తరెడ్డిపాలెం, రాముడుపాలెం తదితర చిన్న గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. తిమ్మాపురం, గాంధీనగర్ గ్రామాల్లో పథకం ప్రారంభమైన సమయంలో తాగునీరు సరఫరా చేశారు. తదుపరి తాగునీరు రెండు గ్రామాల్లో నేటి వరకు తాగునీరు రాలేదని గ్రామస్తులు తెలిపారు. రామడుపాలెం గ్రామస్తులు సమీపంలోని ప్రకాశం జిల్లా కెల్లంపల్లి నుంచి బైకులపై తాగునీరు తెచ్చుకుంటునామని ఆవేదన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆర్వోప్లాంటు నీరు తాగుతున్నామని తద్వారా మోకాలు నొప్పులతో బాధపడుతున్నామని గ్రామస్తులు వాపోయారు.

మంచినీటి పథకం మరమ్మతులకు ఎప్పటికప్పుడు అంచనాలు వేయటం మరమ్మతులు చేయటం మినహా పూర్తిస్థాయిలో తాగునీరు విడుదల చేయలేకపోతున్నారని అధికారుల తీరుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పథకం నిర్వహిస్తున్నప్పటికీ మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవటంతో లక్ష్యాలు చేరుకోలేకపోతున్నామని నిర్వాహకులు తెలిపారు.



బైకుపై కెల్లంపల్లి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న రాముడుపాలెం గ్రామవాసి

చర్యలు చేపడతాం



తాగునీటి పథకం పైపులైను చెడిపోయిన మోటార్ల మరమ్మతులు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కారిస్తాం.

–మూఢవత్ ఆకాష్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, నూజెండ్ల

తాగునీరొచ్చి సంవత్సరాలైంది



రక్షత మంచినీటి పథకం ద్వారా తాగునీరు విడుదలై సంవత్సరాలు జరిగిపోయాయి. స్థానికంగా దొరికే ఆర్వో నీటివల్ల కీళ్ళ నొప్పులు వస్తున్నాయి. అధికారులు స్పందించి పథకాన్ని మరమ్మతులు చేయించి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–దాసయ్య, రవ్వారం

కలుషిత నీరు తాగుతున్నాం



ఊరచెరువులో మంచినీటి చెరువు రెండు పక్క పక్కనే ఉండటం వల్ల కలుషిత నీరు తాగాల్సి వస్తుంది. స్వచ్ఛమైన నీరు అందేలా అధికారులు పర్యవేక్షణ చేయాలి.

–బొట్టు ఎర్రయ్య, బుర్రిపాలెం

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక

యడ్లపాడు: బాలిక తప్పిపోయిన ఘటనను సవాలుగా తీసుకున్న పోలీసులు, కేవలం రెండు గంటల్లోనే బాలిక ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన భూక్య శంకర్‌నాయక్ కుమార్తె చిలకలూరిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో బాలిక కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బారాయుడు, తన సిబ్బందితో కలిసి వెంటనే గాలింపు ప్రారంభించారు. సమర్థవంతమైన అన్వేషణ అనంతరం కేవలం రెండు గంటల్లోనే మార్టూరులో బాలికను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తీసుకువచ్చి అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



కుటుంబ సభ్యులకు బాలికను అప్పగించిన మహిళా పోలీస్

పేటలో ఆగని అక్రమ నిర్మాణాలు

- రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంపై అధికారుల నిర్లక్ష్యం
- ఆక్రమణదారులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- పట్టించుకోని ఆక్రమణదారులు
- యథేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణాలు



ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలు

నరసరావుపేట రూరల్: అల్లూరివారిపాలెంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడంతో ఆక్రమణదారులు తమ పనులను కొనసాగిస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎస్‌టి కాలనీకి చెందిన దాదాపు రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిని సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆక్రమణలు కొనసాగుతుండటంతో కేవలం నోటీసులు జారీ చేసి పంచాయతీరాజ్ శాఖకు ఈ వ్యవహారాన్ని బదిలీచేశారు. పంచాయతీ కార్యదర్శి మరోమారు ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఇచ్చిన నోటీసులు ఆక్రమణదారులకు చీమకుట్టినట్టయినా లేదు. అధికారంలో ఉన్నామనే ధైర్యంతో ఆక్రమణ నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. నోటీసులిచ్చిన అధికారులు ఆ తరువాత ఆక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తయినా చూడలేదు. దీంతో ప్రభుత్వ స్థలంలో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ ఆక్రమణలు సాగుతున్నా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సంక్షిప్త వార్తలు

ప్రైవేటీకరణ నిలిపి సొంత గనులు కేటాయించాలి

నరసరావుపేట: అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్‌ను బీజేపీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే కుట్రలలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో లాభసాటిగా నడుస్తున్న పరిశ్రమను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, కౌలు రైతు సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామా రావు, డి.శివకుమారి, మల్లీశ్వరి, మహమ్మద్ బాషా, ఏఐటీయూసీ నాయకులు వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. నివేశన స్థలాలు అందజేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సీపీఐ ఆధ్వర్యంలో శనివారం అర్జీల అందజేత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

వినుకొండ: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో హనుమాన్ డెంట్ కేర్ హాస్పటల్ సహకారంతో హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో పది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు, డాక్టర్ నవీన్, మరనాత వెల్లటూరు యేసయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి వినతి

యడ్లపాడు: స్థానిక ఎర్రచెరువు ఎస్‌బీఐ బజార్ ప్రాంత వాసులు తమ హక్కుల పరిరక్షణ కోసం పంచాయతీ కార్యదర్శి శశికళను కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తాము అక్కడ నివసిస్తూ జీవనోపాధి కోసం చిన్నపాటి దుకాణాలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే, తమ దుకాణాలను అక్రమ నిర్మాణాలుగా పేర్కొంటూ తొలగించాలని తాజాగా ప్రభుత్వ యంత్రాంగం మైకు ప్రచారం ద్వారా హెచ్చరిస్తోందని వాపోయారు. అధికారులు నిర్దేశించిన మేరకు తాము పన్నులు కడుతూ, అన్ని నిబంధనలను పాటిస్తున్నప్పటికీ, ఇలాంటి చర్యలు తీసుకుంటే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

దరిశి శ్రీనివాసరావుకు పీహెచ్‌డీ



నరసరావుపేట: రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెం గ్రామానికి చెందిన దరిసి శ్రీనివాసరావుకు ఆచార్య నాగార్జునా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ లభించింది. ఎకనామిక్స్ విభాగంలో దీన్ దయాళ్ ఉపాధ్య గ్రామీణ కౌసల్య యోజన పథకం–గుంటూరు జిల్లాలోని గ్రామీణ యువతపై దాని ప్రభావం అనే అంశంపై డాక్టర్ ఎస్.సంజీవరావు పర్యవేక్షణలో పరిశోధనా పత్రం సమర్పించినందుకు తనకు పీహెచ్‌డీ లభించినట్లు శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు.

మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌కు స్వల్ప గాయాలు



నరసరావుపేట: పట్టణంలోని తన నివాసం ఉన్న గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి తలకు స్వల్ప గాయమైంది. గురువారం సాయంత్రం తన గృహంలో స్నానం చేసేందుకు వెళ్లగా కాలుజారి అదుపుతప్పి కిందపడ్డారు. ఈ సమయంలో ఆయన తల కప్‌బోర్డుకు తగిలింది. దీంతో ఆయన స్థానిక ప్రైవేటు వైద్యులను సంప్రదించగా స్కానింగ్ తీసి వైద్యపరీక్షలు చేసి తలకు స్వల్ప గాయమైనట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. విషయం తెలియగానే శుభ కార్యక్రమం నిమిత్తం వేరే ప్రాంతంలో ఉన్న స్థానిక మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కాసు గృహానికి వచ్చిన పరామర్శించారు. మాజీ మంత్రి విడదల రజని ఫోన్‌లో పరామర్శించి ఆరోగ్యవిషయాలపై వాకబు చేశారు. డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, ఆయన తనయుడు సుధీర్‌భార్గవరెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు, గురజాల నియోజకవర్గ నాయకులు కాసు గృహానికి స్వయంగా వచ్చి పరామర్శించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం



శావల్యాపురం: సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ శ్రీరామా పబ్లిక్ స్కూల్ సారథ్యంలో కొత్తలూరు క్యాంపస్‌లో ఈనెల 16న గుండె–క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్ చందు శుక్రవారం తెలిపారు. పాఠశాల ప్రారంభించి 25 సంవత్సరాల రజతోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో గర్భాశయ, క్యాన్సర్, రొమ్ము, నోటి, ఊపిరితిత్తులు, లివర్ క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించటంతో పాటు వ్యాధిగ్రస్తులకు వైద్యసలహాలు, సూచనలు, ఉచితంగా ఇస్తారన్నారు. కిమ్స్–చక్ర క్యాన్సర్ సెంటరు గుంటూరు లైఫ్ వైద్యశాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టరు కమలాకర్, డాక్టరు కందుల రాము, పమిడి యశ్వంత్, ఊడత సుమన్, పి.శ్రీఫణి, టి.మహతి, చంద్రశేఖర్ దర్శి తదితరులు మెరుగైన వైద్యసేవలు అందిస్తారన్నారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



నరసరావుపేట రూరల్: యల్లమందలోని జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణలో శుక్రవారం సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలలో 1988 నుంచి 92 మధ్య కాలంలో ఏడు నుంచి పదవ తరగతి చదివిన విద్యార్థులు కార్యక్రమానికి సహకరించారు. అలాగే పాఠశాల పూర్వవిద్యార్థులు కడియాల వీరయ్య, కడియాల కిరణ్‌కుమార్‌ల సహకారంతో డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉయ్యాల పార్వతి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు వై.హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షుడు చంద్రన్నలు ముఖ్యఅతిథులుగా పాల్గొని సరస్వతి దేవి విగ్రహం, డైనింగ్‌హాల్‌ను ప్రారంభించారు. పూర్వ ఎస్పీఎల్ షేక్ నబీ బాజి, సి.హెచ్.వీరాంజనేయులు, కడియాల నాగేశ్వరరావు, మానుకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి మాజీ మంత్రి రజని పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నాన్ని వడ్డిస్తున్న మాజీ మంత్రి రజని

యడ్లపాడు: ప్రజలందరూ సుఖశాంతులతో, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ మాజీ మంత్రి విడుదల రజని ప్రసన్నాంజనేయ స్వామిని ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీ పరిధిలో ఘనంగా నిర్వహించిన ప్రసన్నాంజనేయ స్వామి 41వ తిరునాళ్లలో ఆమె పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరునాళ్లకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ఆధ్యాత్మికత గ్రామీణ సమాజంలో సఖ్యతను పెంపొందిస్తుంది. మానవత్వాన్ని పదిలపరుస్తుంది. ఇలాంటి పవిత్రమైన వేడుకలు మన సంప్రదాయాలను కొత్తతరాలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి అని పేర్కొన్నారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ మద్దూరి విజయబాలచంద్రారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలూరి శ్రీనివాసరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

చెట్టునురా.. అగ్గిపెట్టకురా!



గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన చింతచెట్టు



రోడ్డుపై పడ్డ చెట్టు కొమ్మలు

'చెట్టునురా... కొట్టకురా.. అమ్మనురా.. అమ్మకురా ' అని ఓ కవి మాట. నిజమే. చల్లటి నీడనిచ్చి.. వేళకు అంత ఫలాలనిచ్చే వృక్ష జాతిపై మమకారం చూపకపోగా వాటి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. చిలకలూరిపేట–నరసరావుపేట రాష్ట్రీయ రహదారి అమీన్ సాహెబ్‌పాలెం వద్ద ఇదే ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పుపెట్టాడు. దీంతో చెట్టు కాండం కాలి కొమ్మలు విరిగి రహదారిపై పడ్డాయి. శుక్రవారం ఉదయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నాదెండ్ల మీడియా వాట్సాప్ గ్రూపులో వచ్చిన సమాచారంతో చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు స్పందించారు. కొద్దిసేపటికే పోలీసులు అక్కడకు చేరుకుని చెట్ల కొమ్మలను తొలగింపచేసి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. దీనిపై జాతీయ రహదారుల సంస్థ డీఈఈ శ్రీనివాసరావు స్పందించి సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపి వివరాలు సేకరించారు. అసలే ఎండాకాలం. ఎండలు మండిపోతున్న తరుణంలో పచ్చని చెట్లను కొందరు వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చటంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

–నాదెండ్ల

ఆనందాల రంగోలి



హోలీ పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్, దక్షిణం బజారు గమిడా ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద మహిళలు చిన్నారులు ఒకరికొకరు రంగు నీళ్ల చల్లుకొని రంగులు పూసుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు ఉత్సాహంగా పర్వదినాన్ని జరుపుకున్నారు.

–వినుకొండ

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న భక్తులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారి వెంబడి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 30 అడుగుల విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు తెలిపారు. ఈసందర్భంగా జుజ్జూరి శ్రీనివాసరావు, పులుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సౌజన్యంతో రూ.50 లక్షల వ్యయంతో నూతన దేవాలయం విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భూమి పూజలో దంపతులచే విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు దీకొండ చారి, కంచర్ల సుబ్బారావు (రాజానుబ్బడియో) మాచబత్తిని వెంకటచారి, పులుకూరి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు గోరంట్ల హనుమంతరావు, బొడెపూడి వెంకటేశ్వర్లు, ముక్కపాటి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు పంచాయతీల్లో ముగిసిన గ్రామసభలు



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ

బొల్లాపల్లి: మండలంలో 16వ సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు ముగిశాయి. శుక్రవారం చివరి రోజు బండ్లమోటు, నాయుడుపాలెం, మర్రిపాలెం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. బండ్లమోటు పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీవో, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పనులను తనిఖీ చేసి ఆయా పంచాయతీ కేంద్రాల్లో సోషల్ ఆడిట్ బృందాలు చేపట్టిన పనుల గురించి వివరించడం జరిగిందన్నారు. 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు చేపట్టిన పనులను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 16వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటిసరఫరా విభాగం, పంచాయతీ రాజ్‌లకు చెందిన 625 పనులకు గాను రూ.13.81కోట్ల మేర నిధులతో ఆయా గ్రామాల్లో పనులు జరిగాయన్నారు. 33 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో చేపట్టిన పనులను తనిఖీలు చేసి పంచాయతీల్లో గ్రామసభల అనంతరం ఈ నెల 18న మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు. ఆయా పంచాయతీల్లో చేపట్టిన పనుల గురించి పూర్తిగా ప్రజావేదికలో వివరించనున్నట్లు పీవో వెల్లడించారు. గ్రామసభల్లో సర్పంచ్‌లు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.